ప్రజాశక్తి
గురువారం 05 డిసెంబర్ 2024 5
కర్నూలు



6 నుండి రెవెన్యూ సదస్సులు

- కలెక్టర్ పి.రంజిత్ బాషా



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా


ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఈనెల 6వ తేది నుండి జనవరి 8వ తేది వరకు రెవెన్యూ సదస్సులను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ భాష పేర్కొన్నారు. బుధవారం విజయవాడ నుండి రెవెన్యూ సదస్సుల నిర్వహణపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంత్రి సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల నిర్వహణకు ఇది వరకే షెడ్యూల్ రూపొందించామన్నారు. ప్రజా ప్రతినిధులు, మండల స్పెషల్ ఆఫీసర్లు, ఎన్జీఓలతో కూడా సమావేశాలు నిర్వహించామన్నారు. జిల్లాలో 472 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయని, అందులో రీసర్వే పూర్తి అయిన 254 గ్రామాల్లో గ్రామ సభలను నిర్వహించామన్నారు. గ్రామ సభల ద్వారా 18వేల దరఖాస్తులు వచ్చాయన్నారు. రెవెన్యూ సదస్సులను విజయవంతంగా నిర్వహించేందుకు వీలుగా అధికారులతో టీములు ఏర్పాటు చేశామన్నారు. తహశీల్దార్‌తో ఒక టీమ్, డిప్యూటీ తహశీల్దార్ తో ఒక టీమ్ గ్రామాలకు వెళ్ళేలా షెడ్యూల్ రూపొందించామన్నారు. ఒక టీమ్ పూర్తిగా ఫీల్డ్ లో ఉంటే ఇంకొక టీమ్ ఆఫీస్‌లో ఉండేలా షెడ్యూల్ రూపొందించామన్నారు. మండలానికి ఒక జిల్లా అధికారికి నోడల్ అధికారిని నియమించడం జరిగిందని కలెక్టర్ మంత్రికి వివరించారు. వీడియో కాన్ఫరెన్స్ లో జెసి డాక్టర్ బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్‌ఓ సి.వెంకట నారాయణమ్మ, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్ పాల్గొన్నారు.

పండుగలా మెగా పేరెంట్స్ డే నిర్వహించాలి : కలెక్టర్

ఈ నెల 7న జరిగే మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాన్ని పండుగలా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా విద్యా శాఖాధికారులను ఆదేశించారు. ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంఈఓలతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డిసెంబరు 7వ తేదీన జరిగే మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశానికి రాష్ట్ర ప్రభుత్వం చాలా ప్రాధాన్యత నిస్తోందన్నారు. అందువల్ల ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని విజయ వంతంగా నిర్వహించాలని ఆదేశించారు. పాఠశాలల్లో కార్యక్రమ నిర్వహణకు సంబంధించి 13 కమిటీలను ఏర్పాటు చేశారా? విద్యార్థుల తల్లిదండ్రులను, ప్రజాప్రతినిధులను ఆహ్వానించారా? అన్ని పాఠశాలలకు పిల్లల విద్య పురోగతికి సంబంధించి ఆన్లైన్‌లో చూసుకునేలా రూపొందించిన హెూలిస్టిక్ కార్డ్స్, ప్రోగ్రెస్ కార్డ్స్ అందాయా? అన్ని ఏర్పాట్లు చేశారా అని కలెక్టర్ అన్ని మండలాల ఎంఈఓలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాన్ని ఆహ్లాద కరమైన వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి ఎప్పటికప్పుడు సూచనలు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ డిఈఓ శామ్యూల్ పాల్‌ను ఆదేశించారు.

బిల్లుల మోత..



- ట్రూఅప్, సర్దుబాటు ఛార్జీల బాదుడు

- వైసిపి బాటలోనే కూటమి ప్రభుత్వం

- బిల్లుల్లో రూ.150 నుంచి రూ.350 వరకూ పెరుగుదల

- జనవరి నుంచి మరో బాదుడుకు రంగం సిద్ధం

"కర్నూలు నగరంలోని శ్రీరామ్ నగర్‌కు చెందిన ఓ విద్యుత్ వినియోగదారునికి గత నెలలో రూ.430 విద్యుత్ బిల్లు రాగా ప్రస్తుతం రూ.558 విద్యుత్ బిల్లు వచ్చింది. శీతాకాలం కావడంతో గతం కంటే తక్కువ విద్యుత్ వినయోగించినా కూడా రూ.128 అధిక బిల్లు వచ్చింది." ఇలా విద్యుత్ బిల్లులు చూసి జనం షాక్‌కు గురవుతున్నారు. ట్రూఅప్, సర్దుబాటు ఛార్జీల పేరుతో కూటమి ప్రభుత్వం జనంపై పెనుభారం మోపింది. గత నెల బిల్లుకంటే విద్యుత్ వాడకాన్ని బట్టి రూ.150 నుంచి రూ.350 వరకూ అదనంగా వచ్చిన పరిస్థితి ఉంది. డిసెంబర్ రెండో తేదీ నుంచి విద్యుత్‌శాఖ కరెంటు బిల్లులు తీస్తుంది. ఆ బిల్లులు చూసి సామాన్యులు హడలిపోతున్నారు. అప్పుడు వైసిపి.. ఇప్పుడు కూటమి ప్రభుత్వం తమపై విద్యుత్ భారాలు మోపుతూ వికట్టహసం చేస్తున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతేడాది వాడుకున్న విద్యుత్‌కు సంబంధించి ప్రభుత్వం ప్రజలపై ట్రూఅప్, సర్దుబాటు భారం మోపింది. డిసెంబర్‌లో ఇస్తున్న బిల్లుల నుంచి ఈ బాదుడు మొదలుపెట్టింది. జనవరిలో అదనంగా మరో ఛార్జీ మోతకు ఇప్పటికే అన్నీ సిద్ధం చేసింది. దీంతో జనానికి ఏం చేయాలో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది...

సామాన్యులు కట్టలేరు



కూలి పని చేసుకుని బతుకే మాలాంటి వారిపై కరెంట్ బిల్లులు పెంచుతూ భారాలు వేయడం సరైంది కాదు. బిల్లులు కట్టలేక గతం లాగా లాంతరు పెట్టుకొని రాత్రులు గడపాల్సిన పరిస్థితి వచ్చేటట్లు ప్రస్తుత ప్రభుత్వాలు చేస్తున్నాయి.

- సి.ఉష, సంపత్ నగర్, కర్నూలు.

ప్రభుత్వం ఆలోచించాలి



ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా పేదలపై కరెంటు ఛార్జీల భారాన్ని మోపుతున్న కూటమి ప్రభుత్వం ఆలోచించాల్సిన అవసరం ఉంది. రోజువారి కూలీలుగా ఒక పక్క ధరలు పెరిగి మరొక పక్క కరెంటు చార్జీలు పెరగడంతో ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. గత ప్రభుత్వం కన్నా మంచి పరిపాలన అందిస్తామని, ప్రజలపైన భారాలు వేయం అని చెప్పిన మాటలను కూటమి ప్రభుత్వం తప్పుతోంది.

- శ్రీలక్ష్మి, ఇందిరా గాంధీనగర్, కర్నూలు.

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 12 లక్షల వరకూ గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో మూడొంతుల విద్యుత్ కనెక్షన్లు సామాన్య, మధ్యతరగతి ప్రజానీకానివే. రెక్కాడితేగాని, డొక్కాడని కుటుంబాలు అనేకం ఉన్నాయి. విద్యుత్ బిల్లుల పేరుతో ప్రభుత్వాలు జనాన్ని పీక్కు తింటున్నాయి. వాడుకున్న కరెంటుకు కాకుండా ఫిక్స్‌డ్ ఛార్జీ, కస్టమర్ ఛార్జీ, ఇడి, సర్‌ఛార్జి, ఇడి ఐఎన్‌టి, ఎఫ్‌పిపిసిఎ, ఎఫ్‌పిపిసిఎ2 ఛార్జీల పేరుతో వీర బాదుడు బాదుతోంది. వాడుకున్న కరెంటుకు, వస్తున్న బిల్లుకు సంబంధం లేకుండాపోయిందని లబ్ధిదారులు వాపోతున్నారు. శీతాకాలంలో విద్యుత్ వాడకం తక్కువగా ఉంటుంది. ఇప్పుడు ఇంత పెద్దమొత్తంలో బిల్లు వస్తే వేసవిలో పరిస్థితి ఏమిటనే భయం అందరినీ వెంటాడుతోంది. చిరు వ్యాపారులు సైతం కరెంటు బిల్లులు చూసి గుండెలు బాదుకుంటున్నారు. దీంతో ఆ భారంసైతం జనాలపై పడనుంది. విద్యుత్ భారాల విషయంలో ప్రభుత్వం తీరు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విద్యుత్ ఛార్జీల పెంపుదలపై అప్పటి వైసిపి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసిన టిడిపి, బిజెపి, జనసేన, ఇప్పుడు కూటమి కింద అధికారంలోకి వచ్చిన తర్వాత మరింత దారుణంగా వ్యవహరిస్తున్న పరిస్థితి కన్పిస్తోంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకలా.. అధికారంలోకి వచ్చాక మరోలా రాజకీయ పార్టీలు వ్యవహరిస్తున్నాయనే చర్చ జనాల్లో సాగుతోంది. సామాన్య ప్రజానీకం ఆదాయాల్లో మాత్రం పెరుగుదల ఉండటం లేదు. నిత్యావసర వస్తువుల నుంచి కూరగాయల ధరలు వరకూ అన్నింటి ధరలూ ఆకాశాన్నంటుతున్నాయి. పెట్రోల్, డీజిల్ ధరలు సెంచరీ దాటేసిన పరిస్థితి ఉంది. కందిపప్పు, మినపప్పు వంటి ధరలు కిలో దాదాపు రూ.150 వరకూ పలుకుతున్నాయి. వంటనూనె కిలో రూ.140కుపైనే ఉంది. ఉల్లిపాయలు కిలో రూ.50కిపైనే పలుకుతోంది. ఇతర కూరగాయల ధరలు కిలో రూ.40 నుంచి రూ.80 వరకూ పెరిగిన పరిస్థితి ఉంది. మరోపక్క విద్యుత్ ఛార్జీల పెంపుతో సామాన్య ప్రజానీకం విలవిల్లాడుతోంది. పెను భారాలు మోపుతూ పాలకులు వ్యవహరిస్తున్న తీరుపై జనాగ్రహం పెల్లుబికుతోంది. వైసిపి ఓటమికి ప్రధాన కారణం తొమ్మిదిసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచడమే. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే అదనపు ఛార్జీల పేరుతో రెండుసార్లు విద్యుత్ ఛార్జీల మోత మోగించింది. దీంతో కూటమి ప్రభుత్వంపై జనాల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

మహిళల భద్రత, బాలికల రక్షణకు

సమన్వయంతో పని చేయాలి

- ఎస్‌పి బింధు మాదవ్

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

మహిళల భద్రత, రక్షణకు, బాల్య దశను ఉన్నతంగా తీర్చిదిద్దే విధంగా అన్ని శాఖలు కలిసి సమన్వయంతో పని చేయాలని జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ అన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటి, డిస్ట్రిక్ చైల్డ్ ప్రోటెక్షన్ యూనిట్, ఐసిడిఎస్, విద్యా శాఖ, లేబర్ డిపార్ట్మెంట్, అంగన్‌వాడీ టీచర్స్, అంగన్ వాడీ వర్కర్స్, కెజిబివి సిబ్బందితో జిల్లా ఎస్పీ సమావేశం నిర్వహించారు. పలు సూచనలు, సలహాలు చేశారు. అనంతరం లైంగిక నేరాల నుంచి పిల్లలకు రక్షణ కల్పించాలనే కరపత్రాలను జిల్లా ఎస్పీ ఆవిష్కరించారు. ఎస్పీ మాట్లాడుతూ ఇటీవల ఒక చైల్డ్ లేబర్‌ను రెస్క్యూ చేసిన ఐసిడిఎస్, ఇతర శాఖల వారిని అభినందిస్తున్నామన్నారు. చిన్నపిల్లలు బిక్షాటన చేయడం ఎక్కడ కూడా కనపడకూడదన్నారు. మహిళలు, చిన్నారుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కొందరూ తెలిసి తెలియక యుక్త వయస్సులో ఉన్న యువతి, యువకులు తల్లిదండ్రులకు చెప్పకుండా ఇంట్లో నుండి వెళ్ళి పోతున్నారన్నారు. తల్లిదండ్రులు అటువంటి పిల్లల ప్రవర్తనను గమనిస్తూ ఉండాలన్నారు. పాఠశాలలో బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌ల గురించి తెలియజేయాలన్నారు. లైంగిక నేరాల బారిన పడకుండా వారిని రక్షించాలన్నారు. పిల్లలపై అఘాయిత్యాలు, బాల్య వివాహాలు, వరకట్న వేధింపులు, లైంగిక వేధింపులను నివారించడానికి పట్టణాలు, మండలాలు, గ్రామాలలో అవగాహన సదస్సులు చేపట్టాలన్నారు. స్వచ్ఛంధ సంస్థలు, ప్రభుత్వ శాఖలు, గ్రామస్థాయి అధికారులు కూడా సహకరించాలన్నారు. మహిళలపై జరుగుతున్న నేరాల నివారణే లక్ష్యంగా అందరూ సమన్వయంతో పని చేయాలన్నారు. బాలబాలికల రక్షణ, సహాయం కొరకు చైల్డ్ లైన్ 1098కు గాని, హైల్ప్ లైన్ 181కు గాని, పోలీసు డయల్ 100 గాని సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ వేల్ఫేర్ కమిటి చైర్‌పర్సన్ ఎస్.జుబేధ బేగం, డిఈఓ శ్యామూల్ పాల్, బాలల సంరక్షణ అధికారి శారద, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ డిపార్ట్ మెంట్ అధికారి నీలకంఠేశ్వర్, సిఐలు ప్రసాద్, శివశంకర్, విజయలక్ష్మీ, ఎన్జీఓలు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎస్‌పి తదితరులు

ఆలూరు ప్రాంత సమస్యలపై పోరాటాలు

- సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్

ప్రజాశక్తి - ఆలూరు

ఆలూరు ప్రాంత ప్రజా సమస్యలపై పోరాటలకు సిద్ధం కావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. బుధవారం సిపిఎం ఆలూరు ప్రాంతీయ మహాసభ స్థానిక జ్యోతిబసు భవన్‌లో సీనియర్ నాయకులు కెపి. నారాయణ స్వామి అధ్యక్షతన జరిగింది. ముందుగా మహాసభ ప్రారంభ సూచికంగా కార్యాలయం ముందు కెపి.నారాయణ స్వామి జెండావిష్కరణ చేశారు. అనంతరం జరిగి కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ మాట్లాడారు. ఆలూరు నియోజకవర్గంలో ప్రజలు ఎన్నుకున్న పాలకులు వారి స్వాలాభానికి పని చేసారే తప్ప ప్రజా సమస్యలను, అభివృద్ధిని పట్టించుకోకుండా గాలికి వదిలేశారన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా ఈ ప్రాంతంలో తాగు, సాగు నీటి ప్రాజెక్టులను మాత్రం నిర్మించడంలో మాత్రం చిత్తశుద్ధి చూపడం లేదన్నారు. పదవుల కోసం పాకులాడుతున్న నాయకులు గ్రామ, పట్టణాలలో తాగు నీరు, రోడ్లు, డ్రైనేజీలు, ఉపాధికి, వలసల నివారణకు కృషి చేయాలన్నారు. ఆలూరు ప్రాంత ప్రజల భవిష్యత్తుకు వేదవతి, నగరడోణ రిజర్వాయర్‌లు నిర్మాణం, పరిశ్రమల ఏర్పాటుకు పోరాటలకు సిద్ధం కావాలని తెలిపారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్.రాధాకృష్ణ, కె.వెంకటేశులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.హనుమంతు, మండల కార్యదర్శి షాకీర్, నాయకులు హొళగుంద వెంకటేశులు, నాగరాజు, క్రిష్ణ, ధనుంజయ, రత్నమ్మ, ఈరన్న, ఈశ్వర్ గౌడ్, హమాలి నాగరాజు, వీరేష్, మైన, షేకున్ బి, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్

ఇళ్ల నిర్మాణానికి దరఖాస్తు చేసుకోండి

- ఎఇ ఉమాకాంత్

ప్రజాశక్తి - మద్దికెర

కొత్త ఇల్లు నిర్మాణానికి లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ ఎఇ ఉమాకాంత్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే కెఇ.శ్యాం బాబు ఆదేశాల మేరకు కొత్త ఇంటి నిర్మాణానికి, రూ.2.50 లక్షలు ఇస్తామన్నారు. మండలంలోని గ్రామాల్లో ఇళ్లు లేని లబ్ధిదారులు సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ వేతనాలివ్వాలి

- సిపిఎం మండల కన్వీనర్ శ్రీరాములు

ప్రజాశక్తి - తుగ్గలి

మండలంలోని అన్ని గ్రామాల్లోని మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలని సిపిఎం మండల కన్వీనర్ శ్రీరాములు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులకు వంట కార్మికులకు మూడు నెలల నుండి సొంత డబ్బులు ఖర్చు పెట్టి తమ ఇంట్లో సంసార ఖర్చులు తగ్గించుకొని కుటుంబాలను అతి కష్టంతో గడుపుతున్నారన్నారు. ప్రభుత్వం మాత్రం ఏ మాత్రం తెలియనట్లు నటిస్తుందన్నారు. ఒక పక్క నిత్యవసర ధరలు విపరీతంగా పెరగటం వల్ల మధ్యాహ్న భోజనం కార్మికులు చాలా ఇబ్బందులు పాలవుతున్నారని, ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి వేతనాలు, వంట నిర్వహణ ఖర్చులు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే కాలం గడిపితే కార్మికులను ఐక్యం చేసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

మంచి వంగడాలతో అధిక దిగుబడులు

- ఎఒ రవి ప్రకాష్

ప్రజాశక్తి- కోడుమూరు రూరల్

మంచి వంగడాలతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఎఒ రవి ప్రకాష్ తెలిపారు. బుధవారం కోడుమూరు గ్రామంలో 'పొలం పిలుస్తుంది' నిర్వహించారు. గ్రామ విత్తనోత్పత్తి పథకం కింద 15 క్వింటాళ్ల వరి రకం 5204ను 30 మంది రైతులకు ఖరీఫ్ సీజన్‌లో ఇచ్చారు. ఈ పంటను బుధవారం పరిశీలించారు. ఈ రకం వరి వాడడం వల్ల రైతు శ్రీనివాసులుకు ఎకరాకు 23 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని తెలిపారు. అలాగే మిగతా రైతుల పొలాల్లోనూ కూడా పరిశీలించారు. ఆర్‌ఎస్‌కె సిబ్బంది జయంత్, ప్రదీప్ కుమార్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల బిల్లుల తనిఖీ

ప్రజాశక్తి - సి బెళగల్

సిబెళగల్‌లో ఇళ్లను నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు అందిన బిల్లులపై డిఆర్‌పి విల్సన్ బుధవారం తనిఖీ చేశారు. సామాజిక తనిఖీలో భాగంగా బెళగల్‌లో 28 ఇళ్లకు బిల్లులు అందినట్లు ఆయన తెలిపారు. ఇక్కడే బిల్లుల అక్రమాలు ఉన్నాయా లేదా అని పరిశీలన చేసి అవకతవకలు లేవని పేర్కొన్నారు. అలాగే పూడిక తీత పనులను పర్యవేక్షణ చేపట్టి ఉపాధి పనులను సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కాలుష్య కోరల్లో హంద్రీ

- రోజురోజుకూ పెరుగుతున్న ఆక్రమణలు

- నగరంలోని మురుగు అంతా హంద్రీలోకే

- నేడు హంద్రీ దినోత్సవం

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్



కర్నూలు నగరం నడిబొడ్డుగుండా ప్రవహిస్తూ, నగరాన్ని రెండుగా విభజిస్తూ, కర్నూలు జిల్లాలోనే పుట్టి కర్నూలులో అంతమయ్యే చిన్ననది హంద్రీనది. హంద్రీ నది పూర్తి పేరు హైంద్రావతి నది. కాల క్రమేన హంద్రి నదిగా స్థిర పడిపోయింది. ఈ నది పైనే గాజులదిన్నె గ్రామం వద్ద ప్రాజెక్టు కట్టబడి ఉంది. ఈ నది పత్తికొండ సమీపంలోని కొండలలో పుట్టి దాదాపు 130 కిలోమీటర్లు ప్రవహించి కర్నూలు నగరం పాత టౌన్ జోరాపురం వద్ద తుంగభద్ర నదిలో కలుస్తుంది. గతంలో ఈ నదిలోని నీరు మంచి నీటితో అలవారుతుండేవి. నగర పరిసర ప్రాంతానికి వచ్చేసరికి ఈ నది కాలుష్యానికి గురవుతోంది. నేడు హంద్రీనది ఒక మురికి నీరు ప్రవహించే నదిగా మారి పోయింది. డిసెంబర్ 5న హంద్రీ దినోత్సవం సందర్భంగా ప్రజాశక్తి ప్రత్యేక కథనం...

కర్నూలు నగరంలో ప్రవహించే హంద్రీ నదిని పురాణాల్లో హైంద్రావతిగా పిలిచేవారు. ఓర్వకల్ మండలంలోని కన్నమడకల గ్రామంలో క్రీస్తుపూర్వం 3000 సంవత్సరంలో నాటి శాసనాన్ని పరిశీలిస్తే అందులో అంధరవతి, అందిరం పదాలు ఉన్నాయి. ఈ నది పరివాహక ప్రాంతంలో అనేక ప్రాచీన తెలుగు పదాలు బయల్పడినాయి. కర్నూలు జిల్లాలోని పత్తికొండ ప్రాంతంలో మద్దికేర మొగలవల్లి నాంచార్ల గ్రామాల్లో ఈ నది జన్మించింది. దాదాపు 16 కిలోమీటర్లు ప్రవహించి కర్నూలు జమ్మి చెట్టు ప్రాంతంలో తుంగభద్రా నదిలో కలుస్తుంది. ఈ నదిలో ఒక్కెర వాగు, మల్లి వాగు, పాలహింద్రి, నల్ల వంక వంటి వాగులు కలుస్తాయి. ఈ నది దాదాపు 50 గ్రామాలకు తాగునీరు, సాగునీటిని అందిస్తుంది. కర్నూలు నగరంలో పనిచేసే నగరపాలక సంస్థ అధికారుల ఇంజనీర్ల నిర్లక్ష్యంతో నగరంలోని డ్రైనేజీ నీటిని అంతయు హంద్రీనదిలోకి వదులుతున్నారు. అంతిమంగా డ్రైనేజి కాలువగా హంద్రీనది మారిపోయింది. హంద్రీ పరిసర ప్రాంతాలలో నివసించు చాలా మంది బహిర్భూమికి వెళ్లడంతో పాటు ఇళ్లలోని చెత్త వేయడం, చనిపోయిన చనిపోయిన జంతువులను, అలాగే కభేలాల నుండి వచ్చే వ్యర్థాలను కూడ హంద్రీనదిలో వేయడం వల్ల హంద్రీనది కాలుష్యం అవుతోంది. హంద్రీ నది పరిసర ప్రాంతాల్లో రాజకీయ నాయకులు, వారి అనుయాయులు హంద్రీలోనే ఏకంగా భవంతులను కడుతున్నారు. కోట్ల విజయభాస్కర్ రెడ్డి కిసాన్ ఘాట్, మ్యూజియం లాంటివి కూడా హంద్రీలోనే ఉన్నాయి. చాలా మంది హంద్రి పరిసర ప్రాంతంలో గుడిసెల వేసుకొని నివసించుచున్నారు. అలాగే కొన్ని కాలనీల ఇల్లు కూడ హంద్రీ నదిలోనికి చొచ్చుకొని పోయాయి. అందు వల్ల హంద్రీనది విస్తీర్ణం తగ్గి వరదలు వచ్చినపుడు నీరు ఇండ్లలోనికి చేరుకుంటోంది. ఈ విధంగా అనేక రకాలైన మానవ తప్పిదాలకుగురై హంద్రీనది కూడ హైద్రాబాద్ "మూసీ" నదిలాగ తీవ్రమైన కాలుష్యానికి గురైంది.

స్వాతంత్ర పోరాటంలో హంద్రీనది

1801లో ముత్తుకూరు గౌడప్ప నాయకత్వంలో జరిగిన తేర్నేకల్ తిరుగుబాటు మొదటి పోరాటంగా చెప్పవచ్చు. ఈ గ్రామం అందరిని తిరుగుబాటు మొదటి పోరాటంగా చెప్పవచ్చు. ఈ గ్రామం హంద్రీ నది ఒడ్డునే ఉంది. 1839లో కర్నూలు నవాబు బ్రిటిష్ వారితో యుద్ధం చేసింది జోహరాపురంలోని హంద్రీ నదిలోనే. 1846-47 ప్రాంతంలో బ్రిటిష్ వారిపై తిరుగుబాటు చేసి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జన్మస్థలం కూడా హంద్రీ పరివాహక ప్రాంతంలోనిదే.

2012 నుంచి హంద్రీ డే

- ఎస్.మన్సూర్ రెహమాన్, రిటైర్డ్ ప్రొఫెసర్, ఎకనామిస్ట్



2012 నుండి హంద్రీ డే ను ప్రారంభించి చేస్తున్నాము. 2013లో స్వచ్ఛంద సేవా దినోత్సవం సందర్భంగా కర్నూల్‌లో ప్రపంచ హంద్రీ డే జరుగుకునేలాగా కర్నూలు కలెక్టర్ గెజిట్ ప్రచురించారు. హంద్రీనీ పరిరక్షించాలనే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం మేధావులతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నాం.

ఆక్రమణ, అపరిశుభ్రత నుండి కాపాడాలి

- వి.వెంకటేశ్వర్లు, పట్టణ పౌర కమిటీ సభ్యులు



కర్నూలు నగర ప్రజలకు ఆహ్లాదాన్ని కల్పించాలి. హంద్రీలో కలిసే మురికి నీటికి ప్రత్యేకంగా హంద్రీ నదికి కుడి ఎడం వైపు ప్రత్యేక మురుగు కాల్వను ముజఫర్ నగర్ నుండి జమ్మి చెట్టు వరకు నిర్మించాలి. అక్కడినుండి జమ్మిచెట్టు వరకు హంద్రీ నదిలో చెట్లు తొలగించి శుభ్రం చేయాలి. మంత్రి ప్రత్యేక చొరవ చూపి పరిష్కరించాలి. కర్నూలు నగరములోప్రవహించే తుంగభద్ర, హంద్రీ నదులను కుడి ఎడం వైపు రోడ్ వేసే అక్కడక్కడ మెగా పార్కులు నిర్మించి, లైటింగ్ సిస్టమ్, వాటర్ ఫౌంటెన్ నిర్మించి కర్నూలు నగరాన్ని అద్భుతమైన పర్యటక కేంద్రంగా అభివృద్ధి చేయెుచ్చు. హంద్రీ నదిని కాపాడేందుకు తమ వంతు కృషిగా ఆదిత్య టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ డాక్టర్ కె. తిరుపాల్ రెడ్డి హంద్రీ నది ఒడ్డున గల స్విమ్మింగ్ పూల్ పక్కన మొక్కలు నాటి సంరక్షిస్తున్నారు. ఇతరులు కూడా ఆదర్శంగా తీసుకొని హంద్రీ పర్యవేక్షణకు ముందుకు రావాలి.

కేంద్ర మంత్రి ప్రకటనపై

చంద్రబాబు సమాధానం చెప్పాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం కడపలో ఉక్కు కర్మాగారం ఏర్పాటుకు హామీ ఇచ్చి పదేళ్ళు గడిచిందని, ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని పార్లమెంటు సమావేశాల సందర్భంగా జనసేన పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి అడిగిన ప్రశ్నకు కేంద్ర ఉక్కు శాఖమంత్రి కుమారస్వామి మాట్లాడుతూ కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణం తమ పరిశీలనలో లేదని సమాధానం చెప్పారని, ఇది కేంద్ర ప్రభుత్వం ఆంధ్ర రాష్ట్రానికి వెనుకబడిన రాయలసీమ చేసిన ద్రోహమే అని సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2014లో ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలుగా విడిపోయిన సందర్భంలో కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో అధికారంలో వచ్చిన చంద్రబాబు తాము అధికారంలో వస్తే కడప నిర్మాణం చేసి తీరుతామని, ఉపాధి అవకాశాన్ని కల్పిస్తామని రాయలసీమ ప్రాంతాల ప్రజలకు హామీ ఇచ్చారని ఆ హామీ మర్చిపోయారా అని ఆయన ప్రశ్నించారు. ఎన్‌డిఎ ప్రభుత్వానికి మద్దత్తు ఇస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు రాయలసీమ ప్రాంతాల ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. తన మద్దతుతో కేంద్రంలో మోడీ సర్కారు కొనసాగుతుంటే ఇప్పుడు అడగకపోతే ఇంకెప్పుడు అడుగుతారనిప్రశ్నించారు. చంద్రబాబు కడపలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు కొరకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు.

శ్రీబాలాజీ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభం

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కర్నూలు నగరంలో శ్రీబాలాజీ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని డాక్టర్ గురు రాజా, ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, బొగ్గుల దస్తగిరి, టిడిపి సీనియర్ నాయకులు ఎదురూరు విష్ణువర్ధన్ రెడ్డి, డాక్టర్ నాగరాజు బుధవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ... నగరంలోని బుధవార పేటలో ఆధునిక వైద్య పరికరాలతో, అనుభవం కలిగిన వైద్యులతో ఆస్పత్రిని ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమని తెలిపారు. పేదలకు తక్కువ ధరకు వైద్యసేవలు అందించాలని కోరారు. శ్రీబాలాజీ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ... ఆస్పత్రిలో, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్, న్యూరో సర్జన్, పీడియాట్రిక్, గైనకాలజీ, ఆర్థోపెటిక్ అన్ని రకాల వైద్యసేవలు పేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటు ధరల్లో నూతనంగా ఏర్పాటు చేశామని తెలిపారు. హాస్పిటల్ నిర్వాహకులు శివ కుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న అతిథులు

వికలాంగులు అన్ని రంగాల్లో రాణించాలి : జడ్జి

ప్రజాశక్తి - పత్తికొండ

వికలాంగులు అన్ని రంగాల్లోనూ రాణించాలని పత్తికొండ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎంఎస్.భారతి తెలిపారు. బుధవారం పత్తికొండ మండల పరిషత్ సమావేశ భవనంలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం నిర్వహించారు. ముందుగా స్థానిక ఎంపిడిఒ కార్యాలయం నుంచి నాలుగు స్తంభాల వరకు ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జడ్జి భారతి హాజరై మాట్లాడారు. సమాజంలో వికలాంగులను అవమానించరాదని తెలిపారు. కార్యాలయ ఆవరణలో వికలాంగులు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ జడ్జితో పాటు న్యాయవాదులు తిలకించారు. న్యాయవాదులు సురాజ్ నబి, నరసింహులు, రజాక్, విద్యుత్ శాఖ జూనియర్ అకౌంటెంట్ లక్ష్మన్న, సెక్రటరీ డైరెక్టర్ సిసి తిప్పన్న, సిద్ధార్థ వికలాంగుల మండల అధ్యక్షులు శ్రీనివాసులు, సభ్యులు ఉరుకుందమ్మ, బీరప్ప, శేషయ్య, వీరేష్, రంగస్వామి, హనుమంతప్ప, సోమన్న, నారాయణ, కృష్ణయ్య పాల్గొన్నారు.

ఘనంగా ఘంటసాల జయంతి వేడుకలు

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్

పద్మశ్రీ ఘంటసాల గాన కళా సమితి అధ్యక్షులు సుస్వరం వాసుదేవ మూర్తి, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్ కల్కూర, కార్యదర్శి రాఘవేంద్ర ప్రసాద్, అనుబంధ కార్యదర్శి యలమర్తి రమణయ్య, కోశాధికారి జగన్నాథ గుప్త ఆధ్వర్యంలో బుధవారం ఘంటసాల 102వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రముఖులు డాక్టర్ డబ్ల్యు.సీతారాం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఘంటసాల చిత్రపటానికి డిప్యూటీ కలెక్టర్ కొండయ్య, డాక్టర్ డబ్ల్యు.సీతారాం పూలమాల వేశారు. ఎలమర్తి రమణయ్య మాట్లాడుతూ... ఘంటసాల విశేషాలను తెలిపారు. ఘంటసాల విగ్రహానికి డాక్టర్ డబ్ల్యు.సీతారాం, డిప్యూటీ కలెక్టర్ కొండయ్య, డాక్టర్ శంకర్ శర్మ, వాసుదేవ మూర్తి పూలమాల వేశారు. డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ... ఘంటసాల ఏ అవార్డులు, రివార్డులు ఆశించలేదని తెలిపారు. ఘంటసాల కార్యవర్గ సభ్యులు డాక్టర్ పి.చంద్రశేఖర్, రాముడు, రంగస్వామి, శ్రీను పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న సభ్యులు

శానిటేషన్ పనులను నిర్లక్ష్యం చేయవద్దు

- మున్సిపల్ కమిషనర్ కృష్ణ


సూచనలు చేస్తున్న కమిషనర్ కృష్ణ

ప్రజాశక్తి - ఆదోని

ఎక్కడ పడితే అక్కడ చెత్తాచెదారం వేయకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణ తెలిపారు. బుధవారం పట్టణంలోని నిజాముద్దీన్ కాలనీ, హనుమాన్ నగర్ ప్రాంతాల్లో పర్యటిస్తూ స్థానికులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అధికారుల అనుమతి లేకుండా అక్రమ కట్టడాలు చేపడితే అలాంటి వారికి జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ప్రతి వార్డులోనూ ప్లానింగ్ సెక్రటరీ ఉంటారని, వారిని సంప్రదించి తగిన డాక్యుమెంట్లు సమర్పిస్తే నిర్మాణానికి అనుమతి సత్వరమే కల్పిస్తున్నామని చెప్పారు. మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని, పరిసరాల పరిశుభ్రతపై స్థానికులకు అవగాహన కల్పించాలని సూచించారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీనియర్ అసిస్టెంట్ చంద్రమోహన్, శానిటేషన్ సెక్రటరీ వెంకప్ప ఉన్నారు.

అధిక సాంద్రత పత్తి సాగు లాభదాయకం

- రిలయన్స్ ఫౌండేషన్ జిల్లా ప్రాజెక్టు ఆఫీసర్ సర్వేశ్ రెడ్డి


మాట్లాడుతున్న సభ్యులు

ప్రజాశక్తి - ఆదోని రూరల్

ఆర్డిఎస్ సంస్థ ఆధ్వర్యంలో అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు రైతులకు అత్యంత లాభదాయకమని రిలయన్స్ ఫౌండేషన్ డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ (డిపిఒ) సర్వేశ్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లాలో 250 ఎకరాల్లో అధిక సాంద్రత పద్ధతిలో భాగంగా పత్తి విత్తనాలను 50 శాతం సబ్సిడీపై పంపిణీ చేసి విజయవంతంగా పండించారని వివరించారు. బుధవారం మండలంలోని ధణాపురం గ్రామంలో రైతు క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. గ్రామ రైతులతో పాటు వివిధ మండలాల నుంచి రైతులు వచ్చారు. ఆర్డిఎస్ సంస్థ అధ్యక్షులు భాస్కర్ ప్రతాప్ మాట్లాడుతూ... రిలయన్స్ ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో 8 మండలాల్లోని 58 గ్రామాల్లో దాదాపు 100 ఎకరాల్లో అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగును ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. అనంతరం కెవికె ప్రధాన శాస్త్రవేత్త రాఘవేంద్ర మాట్లాడుతూ... అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు వల్ల పెట్టుబడి ఖర్చులు తగ్గడంతో పాటు పంట దిగుబడి మరింతగా పెరుగుతుందని తెలిపారు. ఈ పద్ధతిలో ఎకరాలో దాదాపు 29 వేల మొక్కలను పెంచడం సాధ్యమవుతుందన్నారు. ఎడిఎ వెంకటేష్ మాట్లాడుతూ... అధిక సాంద్రత పద్ధతుల ద్వారా పత్తి సాగు సులభతరం కావడంతో పాటు రైతుల ఆదాయం గణనీయంగా పెరుగుతుందని పేర్కొన్నారు. రిలయన్స్ ఫౌండేషన్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ అఫ్రిన్, ఎంఐఎస్ పవన్ పాల్గొన్నారు.

దేశ ప్రజల గుండెచప్పుడు రాజ్యాంగం

- తహశీల్దార్ శేషఫణి


గోడపత్రికను విడుదల చేస్తున్న తహశీల్దార్, నేతలు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర విశిష్ట లక్షణాలు కలిగి స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి హక్కులు కల్పించి భారత రాజ్యాంగం దేశ ప్రజల గుండెచప్పుడు అయిందని తహశీల్దార్ ఎ.శేషఫణి, దళిత రచయితల సంఘం గౌరవాధ్యక్షులు కదిరికోట ఆదెన్న పేర్కొన్నారు. బుధవారం దళిత రచయితల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు, ఉపాధ్యాయులు ఆరెకంటి భాస్కర్ ఆధ్వర్యంలో 75వ భారత రాజ్యాంగ దినోత్సవం వజ్రోత్సవాల గోడపత్రికను తహశీల్దార్ శేషఫణి ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ... భారత రాజ్యాంగ వజ్రోత్సవాలను దేశమంతటా నవంబర్ 26 నుంచి 2025 వరకు ఏడాది పాటు జరపడానికి కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం సంతోషకర విషయమన్నారు. దళిత రచయిత సంఘం ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యాయులు పి.మాదన్న, ఉపాధ్యక్షులు, అధ్యాపకులు పి.రంగస్వామి, రచయిత కొమ్మినేని భోజ రాజు, బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ నాయకులు పూల చింత వీరేష్ పాల్గొన్నారు.

పైపులైన్ ఏర్పాటు



ప్రజాశక్తి - హోళగుంద

మండలంలోని ఎల్లార్తి గ్రామంలో సర్పంచి కురువ చాముండేశ్వరి ఆధ్వర్యంలో బుధవారం దర్గా కాలనీ ప్రజలకు తాగునీరు పైపులైను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యువనేత ఎస్కె.గిరి మాట్లాడారు. దర్గా కాలనీ ప్రజలకు తాగునీరు ఇబ్బందిగా ఉండడవల్ల కొత్త పైపులైను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామంలో ఎటువంటి ఇబ్బంది ఉండకుండా సర్పంచి కురువ చాముండేశ్వరి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడుతున్నారని చెప్పారు.

రెవెన్యూ అధికారుల మాయాజాలం

- అనర్హులకు కౌలు రైతు గుర్తింపు కార్డులు
- లబోదిబోమంటున్న రైతులు

ప్రజాశక్తి - హాలహర్వి

మండలంలోని రెవెన్యూ అధికారుల మాయజాలంతో రైతులు నష్టపోతున్నారు. రైతుల శ్రేయస్సు కోసమే ప్రభుత్వాలు పని చేస్తున్నాయని గొప్పలు చెబుతున్నా ఆచరణలో రెవెన్యూ అధికారుల తప్పిదాలు, మాయజాలంతో పోలీసు స్టేషన్లు, కోర్టుల్లో అధికంగా సివిల్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట సాగు చేసుకుంటున్న పట్టాదారు, గుర్తింపు కార్డు ఉన్న కౌలు రైతులకు ఈ-క్రాప్ నమోదు ద్వారా సబ్సిడీ విత్తనాలు, పంట నష్ట పరిహారం, ఇన్స్యూరెన్స్, పండించిన పంట గిట్టుబాటు ధరలకు కొనుగోలు తదితర పథకాలను ప్రభుత్వాలు అందిస్తున్నాయి. కౌలు కార్డు పొందటానికి పొలం యజమానితో ఒప్పంద పత్రం, పంట పొలానికి సంబంధించిన ధ్రువపత్రాలను, ఇరువురి గుర్తింపు కార్డులు ఉండి విఆర్ఒ, ఆర్ఐ, తహశీల్దార్ విచారించి మంజూరు చేయాల్సి ఉంటుంది. ఈ నిబంధనలు పాటించకుండా రెవెన్యూ అధికారుల చేతివాటంతో తప్పుడు కౌలు రైతు కార్డులు మంజూరు చేసినట్లు రైతులు వాపోతున్నారు. 2023-24లో 332 కౌలు కార్డులు మంజూరు కాగా, 2024 నవంబర్ వరకు రెన్యూవల్‌తో 471 కౌలు కార్డులు మంజూరు చేశారు. చింతకుంట రెవెన్యూ గ్రామంలోనే 64 కౌలు రైతు కార్డులు నమోదు కావడం విశేషం. ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి అర్హులైన రైతులకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

నా పొలంపై నమోదైన కౌలు కార్డును తొలగించాలి

- రఘునాథ్ గౌడ్, పట్టాదారు రైతు, సిరిగాపురం



నేను హాలహర్వి మండలం, సిరిగాపురం గ్రామ రైతును. నాకు చింతకుంట గ్రామం రెవెన్యూ పరిధిలో 183/1లో 2.04 ఎకరాల భూమి ఉంది. నేను సాగు చేసిన పొలంలో ఈ-క్రాప్ నమోదు చేసేందుకు రైతు సేవా కేంద్రానికి వెళితే ఈ భూమి ఇతరులకు కౌలుకు ఇచ్చారని.. ప్రస్తుతం ఈ భూమిలో మరో రైతు పేరుపై నమోదు అయిందని చెప్పడంతో అవాక్కయ్యాను. విఆర్ఒ నా భూమిని అక్రమంగా ఇతరులకు కౌలు రైతు గుర్తింపు కార్డులు ఇచ్చారు. అధికారులు విచారించి న్యాయం చేయాలి.

కౌలు రైతు గుర్తింపు కార్డులపై విచారణ చేపట్టాలి

- కృష్ణ, సిపిఎం మండల నాయకులు



మండలంలో కొన్ని గ్రామాల రెవెన్యూ అధికారులు అనర్హులకు కౌలు రైతు గుర్తింపు కార్డులు ఇచ్చారని ఈ విధంగా చేయడం వల్ల అర్హులైన రైతులు నష్టపోవాల్సి వస్తుంది. రెవెన్యూ అధికారు లు ముడుపుల కొరకు అక్రమంగా ఇతరుల పేరు పై నమోదు చేయడం సరికాదు. ఉన్నతాధికారుల స్పందించి కౌలు రైతు గుర్తింపు కార్డులు పంపిణీలో జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టి అధికారులపై చర్యలు తీసుకోవాలి.

భవిష్యత్తులో సాంకేతిక పరిజ్ఞానంతో సేవలు

- ఎంపిడిఒ సుబ్బరాజు

ప్రజాశక్తి - కౌతాళం

రాబోయే రోజుల్లో సాంకేతిక పరిజ్ఞానంతో ప్రజలకు సేవలు అందుతాయని ఎంపిడిఒ సుబ్బరాజు పేర్కొన్నారు. బుధవారం కౌతాళం-1 గ్రామ సచివాలయ పరిధిలో హౌస్ ఇమేజ్ అండ్ జియో కోఆర్డినేట్స్ ఆఫ్ హౌస్ హోల్డ్స్, మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ కింద జరుగుతున్న సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డారు. హౌస్ ఇమేజ్‌లో యజమాని ఇంటిని జియో లొకేషన్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. దీని ద్వారా ప్రభుత్వ పథకాలు ఏయే ఇంటికి అందుతున్నాయో తెలుసు కోవచ్చన్నారు. మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ ద్వారా చిన్న, చిన్న వ్యాపారులను, వారి వివరాలను నమోదు చేయడం ద్వారా భవిష్యత్తులో వారి వ్యాపార అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నట్లు చెప్పారు. పరిపాలన అధికారి సత్యన్న, పంచాయతీ కార్యదర్శి శివప్ప, ఇంజినీరింగ్ అసిస్టెంట్ వెంకట జ్యోతిర్మయి, వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు హుస్సేని, రవీంద్ర పాల్గొన్నారు.


సర్వేలో పాల్గొన్న ఎంపిడిఒ

ఎరిగేరిలో కబడ్డీ టోర్నమెంట్

ప్రజాశక్తి - కౌతాళం

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఎరిగేరి గ్రామ అంబేద్కర్ యువసేన ఆధ్వర్యంలో కబడ్డీ టోర్నమెంట్ ను బుధవారం ప్రారంభించారు. ముందుగా డాక్టర్ బిఆర్.అంబేద్కర్, రమాబాయి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. టిడిపి కౌతాళం అధ్యక్షులు కాశీ విశ్వనాథ్, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి రాజ బాబు, మంజు నాథ్, సర్పంచి పాల్ దినకరన్, మాజీ సర్పంచి అవతారం ప్రారం భించారు. వారు మాట్లాడారు. స్నేహభావం పెంపొం దించి నైపుణ్యం ప్రదర్శించడానికి క్రీడలు ఉపయోగపడతాయన్నారు. జనసేన నాయ కులు చిన్న, ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షులు ఆనంద్, దళిత సమైక్య నాయ కులు తిమోతి, రఘురామ్, శీను పాల్గొన్నారు.

త్వరలో వంద పడకల ఆస్పత్రి ప్రారంభం : బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

నూతనంగా నిర్మించిన ప్రభుత్వ వంద పడకల ఆస్పత్రి త్వరలో ప్రారంభం కానుందని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి పేర్కొన్నారు. నూతనంగా నిర్మించిన వంద పడకల ప్రభుత్వాస్పత్రిని బుధవారం ఆయన సందర్శించారు. ముందుగా వైద్యులతో హెచ్‌డిసి సమక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. తన తండ్రి, మాజీ మంత్రి కీర్తిశేషులు బీవీ.మోహన్ రెడ్డి హయాంలో 50 పడకల ఆస్పత్రిని తీసుకొచ్చినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశీస్సులతో వంద పడకల ఆస్పత్రిని పూర్తి స్థాయిలో నిర్మించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రమాదాలు జరిగినప్పుడు క్రిటికల్ కేర్ సెంటర్ వైద్య సదు పాయాలు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. అలాగే ట్రామా కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దీని ద్వారా అత్యవసర వైద్యం అందించేందుకు సులభం అవుతుందన్నారు. ఇందుకు ప్రతిపాదన కూడా పెట్టినట్లు తెలిపారు. ఆస్పత్రి అభివద్ధి గురించి శాసనసభలో ప్రస్తావించామని, ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ సుధా, వైద్యులు బాలాజీ, మల్లికార్జున, చిరంజీవి, హెచ్‌డిసి కమిటీ సభ్యులు అంబేద్కర్, రామకృష్ణ, సురేష్ చౌదరి పాల్గొన్నారు.


వైద్యులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే బీవీ


జలజీవన్ సురక్ష పైపులైన్ వేస్తున్న సిబ్బంది

సిసి రోడ్ల ఏర్పాటు

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయం గ్రామంలోని రాఘవేంద్ర పురం కాలనీలో సిసి రోడ్లు వేయడంతో కాలనీ వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 1998-99 సంవత్సరంలో టిడిపి ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి బీవీ.మోహన్ రెడ్డి చేతుల మీదుగా ఇళ్ల స్థలాలు లేని సుమారు 800 మంది నిరుపేదలకు పంపిణీ చేశారు. నాటి నుంచి రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి నియోజకవర్గ ఇన్‌ఛార్జీగా 2014-19 మధ్య టిడిపి పాలనలో ప్రభుత్వ నిధులు తెచ్చి అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేశారు. తర్వాత వచ్చిన వైసిపి ప్రభుత్వంలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాలతో సర్పంచి తెల్లబండ్ల భీమయ్య ఆధ్వర్యంలో సిసి రోడ్లు వేయించారు. ప్రస్తుతం టిడిపి పాలనలో ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి చొరవతో కాలనీలోని 2 రోడ్లతో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందున్న రోడ్డును కూడా వేయించడం మొదలు పెట్టారు. కాలనీలో మరో మూడు రోడ్లు, సిసి రోడ్లు మంజూరు చేయించి కాలనీలో సమస్య లేకుండా చూడాలని కాలనీవాసులు కోరుతున్నారు. మరోవైపు జలజీవన్ సురక్ష ద్వారా ప్రతి ఇంటికీ తాగునీరు సరఫరా చేసేందుకు పనులు పూర్తి కావస్తున్న నేపథ్యంలో కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా ఘంటసాల జయంతి

ప్రజాశక్తి - ఆదోని

ఘంటసాల సప్త స్వరాల కళా సమితి ఆధ్వర్యంలో సినీ సంగీత ఘంటసాల వెంకటేశ్వరరావు 102వ జయంతి వేడుకలు ఆదోనిలో ఘనంగా నిర్వహించారు. బుధవారం కమిటీ సభ్యులు, అభిమానులు ఘనంగా నివాళు లర్పించారు. గౌరవాధ్యక్షులు టి.ఆంజనేయులు, అధ్యక్షులు బి.నీలకంఠప్ప, ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.బసవరాజు స్వామి, ఉపాధ్యక్షులు సాకరే మల్లేశ్వరరావు మాట్లాడారు. ఘంటసాల గానాన్ని, భగవద్గీతను రోజూ స్మరిస్తూ, ప్రేక్షక హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారు. ఘంటసాల సప్త స్వరాల కళా సమితి నాయకులు ఫిరోజ్ అహ్మద్, చంద్రశేఖర్ రెడ్డి, మురళీధర్ గౌడ్, సాయినాథ్, రాముడు, దాదాబాష పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జీ ఎవరు..?

- అధికారిక ప్రకటన లేక అయోమయంలో శ్రేణులు
- ఎవరి వెంట వెళ్లాలో తెలియని పరిస్థితి
- అధికారం ఉన్నా నాయకుల్లో నిరుత్సాహం
- గ్రూపు విభేదాలతో గ్రామాల్లో పట్టు కోల్పోతున్న టిడిపి

ప్రజాశక్తి - దేవనకొండ

టిడిపి ఇన్‌ఛార్జీ ఎవరనే దానిపై అధికారక ప్రకటన లేకపోవడంతో శ్రేణులు అయోమయంలో ఉన్నాయి. ఎవరి వెంట వెళ్లాలో తెలియక ఇబ్బంది పడుతున్నారు. రాష్ట్రంలో టిడిపి అధికారంలో ఉన్నా నాయకులు, కార్యకర్తల్లో నిరుత్సాహం నెలకొంది. గ్రూపు విభేదాలతో గ్రామాల్లో టిడిపి పట్టు కోల్పోతున్న పరిస్థితి నెలకొంది.

టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే తమ పనులు జరుగుతాయని, గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టి కార్యకర్తల్లో ఉత్సాహం నింపాలనే గంపెడ ఆశ టిడిపి నాయకుల్లో ఉండేది. టిడిపి అధికారంలోకి వచ్చినా నాయకులు నిరాశకు గురికావాల్సిన పరిస్థితి నెలకొంది. టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ ఎవరని అధికారికంగా అధిష్టానం నుంచి ప్రకటన ఇవ్వకపోవడంతో దేవనకొండ మండలంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు అయోమయంలో ఉన్నారు. ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఆలూరు నియోజకవర్గంలో టిడిపి నుంచి వీరభద్ర గౌడ్ ఓటమి చవిచూశారు. ఆలూరు ఇన్‌ఛార్జీ బాధ్యతలు కూడా ప్రస్తుతం ఆయననే చూసుకుంటున్నారు. గత కొన్ని రోజుల నుంచి ఆలూరు ఇన్‌ఛార్జీ పదవి నుంచి వీరభద్ర గౌడ్‌ను తీసి వేసి వైకుంఠం జ్యోతి, శివప్రసాద్‌కు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు నియోజకవర్గ వ్యాప్తంగా జోరుగా ప్రచారం సాగింది. వీరభద్ర గౌడ్‌కు వ్యతిరేకంగా ఉన్న టిడిపి నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో సంబరాలు కూడా చేసుకున్నారు. ప్రస్తుతం ఇన్‌ఛార్జీ మార్పు జరగకపోవడం, టిడిపి అధిష్టానం నుంచి ఇన్‌ఛార్జీ బాధ్యతలు అధికారకంగా ప్రకటించకపోవడంతో మండలంలోని టిడిపి నాయకులు అయోమయంలో ఉన్నారు. టిడిపి ఇన్‌ఛార్జీ అధికారిక ప్రకటన లేకపోవడంతో ఏ నాయకుని వెంట వెళ్లాలో దిక్కుతోచని పరిస్థితి నెలకొందని టిడిపి మండల నాయకుల్లో గుసగుసలు వెలువెత్తుతున్నాయి. గత వైసిపి ప్రభుత్వంలో కూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపి సత్తా చాటి 9 పంచాయతీల్లో సర్పంచులు, 6 ఎంపిటిసిలను కైవసం చేసుకుని టిడిపి పటిష్టతను చాటుకుంది. ప్రస్తుతం మండలంలో టిడిపి నాయకుల్లో గ్రూపు విభేదాలు స్పష్టంగా బహిర్గతమయ్యాయి. ఇలానే మండలంలో గ్రూపు విభేదాలు కొనసాగితే టిడిపి పట్టు కోల్పోతుందని పలువురు నాయకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా టిడిపి అధిష్టానం ఆలూరు ఇన్‌ఛార్జీపై అధికారిక ప్రకటన ఇవ్వాలని, నాయకుల్లో ఉన్న విభేదాలు సమసి పోతాయని పలువురు టిడిపి నాయకులు అభిప్రాయపడుతున్నారు.

ప్రాధాన్యత వీధుల్లో సిసి రోడ్డు నిర్మాణాలు : సర్పంచి

ప్రజాశక్తి - చిప్పగిరి



చిప్పగిరిలో ప్రాధాన్యత ఉన్న ప్రధాన రహదారులు, అన్నీ సిసి రోడ్ల నిర్మాణాలు పూర్తి చేస్తున్నామని సర్పంచి దాసరి గోవిందరాజులు తెలిపారు. బుధవారం చిప్పగిరి సచివాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ నిధులు రూ.40 లక్షలతో డ్రెయినేజీతో కూడిన సిసి రోడ్డు నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేస్తున్నామన్నారు. చిన్నగా ఉన్న వీధుల్లోనూ సిసి రోడ్లు వేసేందుకు తీర్మానాలు చేసి అధికారులకు పంపించామని తెలిపారు. తాగునీటి సమస్య ఎదురవకుండా జలజీవన పథకం కింద రూ.53 లక్షలతో కొత్త ట్యాంకు నిర్మించి దాని ద్వారా తాగునీటిని అందిస్తున్నామని చెప్పారు. వేసవికాలం ప్రారంభమయ్యేలోపు ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టామన్నారు. కొండపై ఉన్న గృహాలకు తాగునీరు అందించేందుకు ఎంపిపి నిధులు రూ.4 లక్షలతో నూతన పైపులైను వేసి తాగునీరు అందించామని తెలిపారు. చిప్పగిరిలో మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరిస్తున్నామన్నారు.

అంగన్వాడీలకు వేతనాలు పెంచాలి : సిఐటియు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి గోవర్ధనమ్మ, సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు గోవిందు, రాముడు, జిల్లా ఉపాధ్యక్షులు హనుమంతు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని సుందరయ్య భవన్‌లో అంగన్వాడీల సమావేశం నిర్వహించారు. యూనియన్ నాయకులు శైలజ అధ్యక్షత వహించారు. వారు మాట్లాడుతూ... అంగన్వాడీలకు రూ.26 వేలు వేతనం చెల్లించాలని, గ్రాట్యుటీ, పింఛను సౌకర్యం కల్పించాలని కోరారు. రూరల్ సెక్టార్ కార్యదర్శి శైలజ, నాయకులు గ్రేషమ్మ, అరుణ, భాగ్యమ్మ, నీరజ, శారద, నాగలక్ష్మి, మల్లేశ్వరి, గౌసియా, బండా లత, మున్నీ, లక్ష్మీదేవి, సునీత, వరలక్ష్మి పాల్గొన్నారు.

అభివృద్ధికి నోచని దేవాలయం

- వందెకరాలున్నా అభివృద్ధి శూన్యం
- రామలింగేశ్వర స్వామి ఆలయ పరిస్థితి...

ప్రజాశక్తి - నందవరం

నందవరం మండలం గురజాల గ్రామంలో తుంగభద్ర నదీతీరాన వెలసిన పురాతన రామలింగేశ్వర దేవాలయం అభివృద్ధికి నోచుకోక వెలవెలబోతోంది. దేవాలయానికి 100 ఎకరాల పొలం ఉంది. దేవాలయ అభివృద్ధిని పట్టించుకునే నాథుడు లేరు. టెంకాయల వేలం పాటు హుండీ లెక్కింపు, పొలం కౌలు రూపంలో దేవాలయానికి ఏడాదికి సుమారు రూ.17 లక్షల ఆదాయం వస్తున్నట్లు సమాచారం. రూ.లక్షల్లో ఆదాయం ఉన్నా దేవాలయం అభివృద్ధి మాత్రం జరగడం లేదు. 8 నెలల క్రితం దేవాలయం నిర్మాణం కోసం వైసిపి నాయకులు భూమి పూజ చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు దేవాలయ నిర్మాణం కొద్దిగా కూడా చేపట్ట లేకపోయారు.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో శ్రీశైలం తర్వాత అంతటి విశిష్టత కలిగిన రెండో దేవాలయంగా గురజాల రామలింగేశ్వర దేవాలయం ప్రసిద్ధిగాంచినది. శివరాత్రి మహోత్సవాల సమయంలో రాష్ట్ర ప్రజలే కాకుండా పొరుగు రాష్ట్రాలు కర్ణాటక, తెలంగాణల నుంచి లక్షలాది మంది భక్తులు స్వామివారిని సందర్శించుకుంటారు. సంవత్సర కాలంలో దసరా ఉత్సవాలు, మహాశివరాత్రి, కార్తీకమాస ఉత్సవాలు... జరుగుతూ ఉంటాయి. స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులకు మాత్రం దేవాలయ అధికారులు కనీస వసతులను కూడా కల్పించలేకపోతున్నారు. 12 సంవత్సరాలకు ఒకసారి తుంగభద్ర పుష్కరాలు వస్తాయి. ఆ సమయంలో భక్తుల అవస్థలు వర్ణణాతీతం. వారికి మురుగుదొడ్లు, భక్తులు దుస్తులు మార్చుకోవడానికి కనీసం రూములు కూడా దేవాలయ పరిసర ప్రాంతంలో నిర్మించలేకపోయారు.


రామలింగేశ్వర దేవాలయం

శ్రీరాముడు నిర్మించిన దేవాలయం


- ఆలయ అర్చకులు శివ



ఈ దేవాలయాన్ని శ్రీరాముడు నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. ఈ దేవాలయంలో రెండు శివలింగాలు ఉన్నాయి. ఒకటి కాశీ నుంచి ఆంజనేయస్వామి తీసుకొచ్చిన శివలింగం. రెండోది స్వయంగా శ్రీరాముడు ఇసుకతో నిర్మించిన శివలింగం. శ్రీరాముడు స్వయంగా శివలింగాన్ని, ఈ దేవాలయాన్ని నిర్మించారు. ఈ దేవాలయాన్ని రామలింగేశ్వర దేవాలయం అని పిలుస్తారు.

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి అభివృద్ధికి కృషి చేస్తాం

- శివారెడ్డి, గురజాల గ్రామం



ఆలయ అభివృద్ధి పనుల గురించి ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర దృష్టికి తీసుకెళ్తాం. భక్తులకు నీటి ఇబ్బంది కలుగకుండా ప్రస్తుతం వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేశాం.

రూ.1.25 కోట్లతో ప్రభుత్వ అనుమతి

- కె.కృష్ణ, గురజాల గ్రామం



ఆలయ నిర్మాణానికి రూ.1.25 కోట్లు ప్రభుత్వం అనుమతినిచ్చింది. అందుకుగాను రూ.25 లక్షలు మేము ప్రభుత్వానికి డిపాజిట్ చేశాం. ఆలయ నిర్మాణానికి గతంలో గ్రామ పెద్దలు, దేవాలయ కమిటీ సభ్యులు, నాయకుల సమక్షంలో భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వరరెడ్డి సహకారంతో త్వరలో ఆలయ నిర్మాణాన్ని చేపడతాం.


సభ్యత్వం ఇస్తున్న సూరం భాస్కర్ రెడ్డి

సమిష్టిగానే ముందుకు

- టిడిపి సీనియర్ నాయకులు సూరం భాస్కర్ రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని రూరల్

చంద్రబాబు ఆశయ సాధన దిశగా సమిష్టిగానే ముందుకు సాగుదామని, నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేద్దామని టిడిపి సీనియర్ నాయకులు, వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ మదిరే సూరం భాస్కర్ రెడ్డి తెలిపారు. బుధవారం నియోజకవర్గంలోని సాంబగల్, నెట్టికల్లు గ్రామంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. నాయకుల బృందానికి స్థానిక నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టిడిపి సభ్యత్వ నమోదు రికార్డు స్థాయిలో కొనసాగుతోందని తెలిపారు. రూ.వంద సభ్యత్వంతో రూ.5 లక్షల ప్రమాద బీమా కల్పించడం వల్ల పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. టిడిపి సీనియర్ నాయకులు ఫక్రుద్దీన్, సౌదీ రావుఫ్, రామచంద్ర, సోము, బుద్ధారెడ్డి, గోపాల్ రెడ్డి, నెట్టికల్లు ఈరన్న, మాజీ కౌన్సిలర్ మల్లికార్జున, మల్లేశ్వరప్ప, మద్దికెర రామకృష్ణ, ఎమ్‌డి.హుస్సేన్, నారాయణపురం షాషావలీ, శ్రీనివాసులు, మదిరే మాజీ సర్పంచి గోవిందు, రమేష్, షేకన్న, తిమ్మప్ప, శ్రీనివాస్, ప్రేమ్ కుమార్, దేవదాసు ఉన్నారు.

పోటాపోటీగా గుర్తింపు ఎన్నికలు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని రైల్వే స్టేషన్‌లో యూనియన్ గుర్తింపు కోసం ఎన్నికలు పోటాపోటీగా సాగాయి. రైల్వే స్టేషన్ ఆవరణలో పోలింగ్ సందడి నెలకొంది. బుధవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఎంఆర్‌కెఎస్, ఐఆర్ఎంయు, ఆర్ఎంయు, ఎస్‌సిఆర్ఇఎస్, ఎస్‌సిఆర్ఎంయు యూనియన్ల గుర్తింపు కోసం పోటీలో ఉన్నారన్నారు. ఆదోని రైల్వే స్టేషన్ పరిధిలో ఉద్యోగుల సౌకర్యార్థం 105 నెంబర్ పోలింగ్ కేంద్రం ద్వారా 277 మంది ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఏర్పా ట్లు చేశామన్నారు. గురువారం సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ ఉంటుందని, ఈనెల 12న సికింద్రాబాద్‌లో ఓట్ల లెక్కింపు ఉంటుందని పోలింగ్ అధికారి అమిత్ కుమార్ తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ చోటు చేసుకోకుండా రైల్వే పోలీసులు, ఆర్‌పిఎఫ్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. టూ టౌన్ ఎస్ఐ తిరుపాల్, జిఆర్‌పి ఎస్ఐ గోపాల్ ఆధ్వర్యంలో పది మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు : సిఐ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని రూరల్ సిఐ బీవీ.మధుసూదన్ రావు హెచ్చరించారు. బుధవారం గ్రామీణ పోలీసు స్టేషన్ సిఐగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. గతంలో విధులు నిర్వహించిన సిఐ విక్రమ్ సింహా బదిలీపై వెళ్లారు. కర్నూలు సిసిహెచ్ విధులు నిర్వహిస్తున్న మధుసూదన్‌రావు బదిలీలో భాగంగా సిఐగా వచ్చారు. ఆయన మాట్లాడుతూ... అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా చర్యలు చేపడతామ న్నారు. శాంతి భద్రతలపై అవగాహన కల్పించేందుకు, రోడ్డు ప్రమాదాలను కట్టడి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

జగనన్న కాలనీలో దొంగలు : టిడిపి

ప్రజాశక్తి - పెద్దకడబూరు

పెద్దకడబూరులోని జగనన్న కాలనీలో దొంగలు పడ్డారని టిడిపి ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి బొగ్గుల నరసన్న విమర్శించారు. బుధవారం ఆయన మాట్లాడారు. పెద్దకడబూరులో గత వైసిపి ప్రభుత్వం నివాస యోగ్యం కాని వంక ప్రాంతంలో ఇళ్ల స్థలాలు కేటాయించారని తెలి పారు. ఇళ్ల నిర్మాణానికి ప్రజలెవరూ ఆసక్తి చూపలేదని, గత ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలను కాంట్రాక్టర్లకు కేటాయించడంతో నాసిరకంగా చేపట్టా రని చెప్పారు. కేవలం బేస్ మెంట్ వరకు నిర్మించి నిలిపివేశారని తెలిపారు. జగనన్న కాలనీలోని సిమెంట్ ఇటుకలు, ఇసుకను దొంగలు దోచుకున్నారని విమర్శించారు. అధికారులు పర్యవేక్షించాల ని, నాణ్యతతో ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని కోరారు.